# ప్రణతి

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

# ప్రణతి

రచన

**వేమూరి వేంకట రామనాథం**

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

**2013**

**PRANATHI**

**Vemuri Venkata Ramanatham**

T.T.D. Religious Publications Series No. 1011

© All Rights Reserved

*First Edition : 2013*

Copies :

*Published by :*
**L.V. SUBRAHMANYAM**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

“సన్నుతి”, “వినతి” కృతులమాదిరే ఈ “ప్రణతి” కావ్యం కూడా శ్రీ వేమూరి రామనాథంగారి కర్తృకమే.

తిరుమల యాత్ర చేసిన కవిగారు తమ అనుభవాలను, పొందిన ఆనందాన్ని ఈ పద్యాలలో హృద్యంగా ఉగ్గడించారు. స్వామి సందర్శనాపేక్ష యాత్రికుల్లో ఎంతెంతగా ఉంటుందో రచయిత కృతిలో రమ్యంగా వివరించారు. కాలి నడకన కొండకు చేరే భక్తబృందాల మనోభావాలు, వారి కోర్కెలు ఎలా ఉంటాయో హృదయంగమంగా వారు వర్ణించారు.

“ఒక విచిత్ర సంఘటన” అన్న శీర్షిక క్రింద చెప్పిన పద్యాల్లో స్వామి సందర్శనం లభించక కొండదిగి వెళ్ళుటకు సంసిద్ధమైన తనకు అపూర్వమైన నిజసందర్శన భాగ్యం స్వామి ఎలా కల్గించి తన్ను అనుగ్రహించారో తెలిపి వేమూరి వారు పాఠకులను అలరిస్తున్నారు.

ఈ పుస్తకంలో భారతి మొదలైన పద్నాలుగు శీర్షికల క్రింద చెప్పిన నూటతొమ్మిది పద్యాల్లోని కొన్ని పదాలకు అర్థాలు కూడా వారే వ్రాశారు.

దేవస్థానం స్వీయప్రచురణగా వెలువరిస్తున్న ఈ పద్య రచనను రసజ్ఞులైన పాఠకులు ఆదరిస్తారని అభిలషిస్తున్నాను.

*సదా శ్రీవారి సేవలో....*

తిరుపతి
06.05.2013

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# విషయసూచిక


| విషయం | పుట |
|---|---|
| 1. భారతీ! | 1 |
| 2. ఈ రచన | 3 |
| 3. తొలి వందనము | 4 |
| 4. యాత్రికుల గుంపు | 9 |
| 5. అస్వార్థయాత్ర | 12 |
| 6. ప్రభాతసేవ | 15 |
| 7. కోర్కులు | 17 |
| 8. హుండీ | 21 |
| 9. లడ్డూలు | 22 |
| 10. కాలినడక | 23 |
| 11. ఒక విచిత్ర సంఘటన | 25 |
| 12. అమెరికాలో... | 29 |
| 13. నిఘంటువు | 32 |
| 14. ముగింపు | 34 |

# భారతీ!

చ. పలుకుల రాణికిన్, వినయభావ మహోద్ధృత భక్తితోడ తి
ర్మలవిభు దాల్చి నాదు మనమందున కూర్చిన వృత్తరాశి యం
దలి సుమ సౌరభోత్కరము నర్పణ సేయుదు, నామె పేర్మి నా
కలరు నదృష్టసంఘటన కద్దముగా రచియించు పద్దెముల్. 1

**అర్థం:** ఉద్ధృత= పైకెత్తబడిన; ఉత్కరము= సమూహము; అలరు= వికసించు; పేర్మి= అతిశయము.

చ. పలుకుల పూవులన్ లలిత వల్లరి కూర్చెడు తల్లివీవు, చం
చలమగు భావవార్నిధికి చందురు బోలిన వెల్గువీవు, ని
ర్మల మగు చింతనమ్మునకు లగ్గను గూర్చెడు శక్తివీవు, తి
ర్మలపతి మీది నా కదనమందగు జేయుము నీదు రక్షణన్. 2

**అర్థం:** వల్లరి= తీగె; వార్నిధి= సముద్రము; చింతనము= పలుమాఱు తలచుట; లగ్గు= శుభము.

ఉ. నీ దయ లేనిదే మనసునేర్చిన భావము భాషలోని మ
ర్యాదల కెంతొ సన్నిహిత మైనటు ప్రజ్వలితమ్ము కాదు, నే
నీ దిన మెన్నియో రచన లీ స్థిరసత్యము నుగ్గడించె, న
న్నాదుకొనంగ వేడెద మహాప్రభు తిర్మలదేవు కీర్తనన్. 3

**అర్థం:** మర్యాదలు= కట్టుబాట్లు; సన్నిహితము= సమీపించినది; ప్రజ్వలితము= ప్రకాశించినది; ఉగ్గడించె= మ్రోగె; ఆదుకొను= ఆదరించు.

చ. **తిరుపతి వేంకటేశ్వరు నుతించుచు వ్రాసెడు పద్యయత్న సం**
**భరిత మనస్థితిన్ సహజ మార్దవ సంకలితమ్ము సేయు మం**
**చొఱగని బత్తిమై, పదము పొత్తున చిర్నగవట్లు దాగు చా**
**తురి యగు శారదాంబను, హృదుద్ధర తన్మయరీతి వేడెదన్.** **4**

**అర్థం:** సంకలితము= కూర్చబడిన; ఒఱగని= వంపు లేని; పొత్తున= స్నేహమున; చాతురి= నేర్పు; ఉద్ధుర= నిలుకడైన; తన్మయ= తత్స్వరూపమైన.

చ. **తిరుమలసామి నా పలుకు తీరున కెంతగ కన్నులార్చునో**
**తిరముగ నీవు నా రచన తీర్చిన నిర్మల భావజాల బం**
**ధుర పరిపూత నమ్ర వచనోత్సుకతాధృతి నెంత మెచ్చెదో,**
**అరమర లేని నా విరచనాంబర రోచివి నీవు భారతీ!** **5**

**అర్థం:** ఆర్చు= ఆడించు; తిరము=స్థిరము; బంధుర= ఒప్పిదమైన; పరిపూత= పవిత్రమైన; ధృతి=ధైర్యము; అరమర= సందేహము; అంబర= ఆకాశము.



# ఈ రచన

మ. **అమితానంద తరంగ డోలికల నాహ్లాదమ్ము జృంభించు కూ**
**రిమిమై మా శశి యున్న పట్టణము బర్మింగ్‌హాములో కొన్ని మా**
**సము లున్నప్పుడు మున్నటుల్ తిరుమలేశ ధ్యాన సంభావనో**
**ద్యమ లగ్నోత్సుకతన్ రచించితిని వృత్తమ్ముల్ విశుద్ధోద్ధతిన్.** **6**

**అర్థం:** తరంగ= అలలు; డోలికల= ఉయ్యాలల; జృంభించు= విజృంభించు; శశి= నా కుమారుడు శశాంక; మున్నటుల్= నిరుడుకూడ ఇటులే; సంభావన= తలపు; ఉద్యమ= యత్నము; లగ్న= తగులుకొన్న; విశుద్ధ+ఉద్ధతి= దోషము లేని గర్వము.

చ. **తిరుపతి వేంకటేశ్వరు నుతించుచు వ్రాసెడు పద్యభంగ సం**
**సరణము నా హృదబ్ధిని నిసర్గ నిరుద్యతరీతి నుండు న**
**ట్లరమర లేని భావమున నల్ల దొడంగితి పద్యరాశి; నీ**
**చరణము లూగు సౌరునకు సామియె కర్త కలమ్ము నాదిగా.** **7**

**అర్థం:** భంగ= అలలు; సంసరణము= బాట; నిసర్గ= స్వభావ సిద్ధమైన; నిరుద్యత= యత్నించని; అరమర= సందేహము; రాశి= ప్రోగు; సౌరు= అందము.

ఉ. **పండితు లిందు తప్పులను పట్టిన నయ్యవి నావెకాని బ్ర**
**హ్మాండము బొజ్జలో గల మహాత్ముని వంచు దలంచ, భూమిపై**
**నుండిన నాళ్ళు చేతనగు నొప్పుల గూర్చ దలంచి వ్రాతు, నీ**
**రెండను బోలు నా రచన నింపుగ జూతురొ పండితోత్తముల్ !.** **8**

# తొలి వందనము

ఉ. ఎన్నియొ యేండ్ల క్రింద రచియించితి వందకు పైన వృత్తముల్
"సన్నుతి" యన్న శీర్షిక నొసంగుచు తిర్మల వేంకటేశుపై,
క్రన్నన క్రిందటే డిట తలంచని రీతి శశాంక యింటిలో
నున్న దినమ్ములన్ మఱొక నూరును మించినయట్లు వ్రాసితిన్. **9**

**అర్థం:** క్రన్నన= మఱల; శశాంక= నా కుమారుడు.

చ. తిరిగి శశాంక యింటి కరుదెంచితి వేసవి వేళ నీడ, నొం
టరిగ గృహమ్మునన్ గడుపుటన్ గల గడ్డు తలంపు కాలసం
హరణము గూర్చి, కాని రుట మైనది క్రిందటి యేడె వేంకటే
శ్వరుని నుతించు పద్దెముల బాట శుభంకర కార్యదీక్షగా. **10**

**అర్థం:** ఈడ= ఈచోటు; గడ్డు= పెద్ద; రుటము= దృఢము; సంహరణము= సంహరించుట.

మ. మఱి యే పబ్బము లేని యీ బసను సంబాళించు నుత్సాహ బం
ధుర కార్యమ్ముగ దోచె నా మనసు నేదో కొంతగా కళ్లెమం
దొరగం జేసి కవిత్వకల్పనముపై నుత్కంఠతో వేంకటే
శ్వరుపై మున్నువలెన్ తలంపులభటన్ సంధించు టుద్వృత్తిమై. **11**

**అర్థం:** సంబాళించు= ఆదరించు; బంధురము= ఒప్పిదమైన; ఒరగు= వంగు; ఉత్కంఠ= తహతహ; భట= వరుస; సంధింప= కూర్చు; ఉద్వృత్తి= గర్వము.



ఉ. వ్రాసితి నింత ముందె, మఱి వ్రాయుట కింకను నున్నదా, యటం
చీసడమున్ ధ్వనించకు దశేష మహత్వ విశిష్ట గుంఫితో
ల్లాస నిధానమౌ తిరుమలాధిపు నెంచి మనస్సులో కవి
త్వాసవమున్ ద్రవింపగల తన్మయదీక్ష చెలంగ గోరెదన్. **12**

**అర్థం:** ఈసడము= నింద; గుంఫిత= కూర్చబడిన; ఉల్లాస= ప్రకాశము; నిధానము= పాతఱ; ఆసవము= పూదేనె; చెలంగు= వికసించు.

ఉ. చెప్పితి నేమొ మున్ననెడు చిక్కు గ్రసింపగ మధ్య మధ్య నీ
చొప్పున నేదొ నూత్నతను జొన్పితి నంచు తలంతు, బొమ్మలో
విప్పని కంటి చూపు టటవిన్ తెగక్రమ్మిన భావ భూజముల్
కప్పిన నీడలోని లతలట్టుల నూగును నాదు పద్దెముల్. **13**

**అర్థం:** చిక్కు= మెలి; గ్రసింపగ= కవ్వగ; చొప్పు= విధము.

మ. ప్రతి భారత్ క్షితి వాసియున్ స్థిరమతిన్ "స్వాతంత్ర్య సిద్ధిన్" క్రమ
స్థితిలో క్షుణ్ణముగా నెఱుంగు నటులన్, శ్రీ సిద్ధ "రామాయణ
స్మృతు" లన్ మానసపద్మమందు నిలుపన్ శ్రేయస్సు నర్థించి, నే
కృతులన్ జేసితి ముందు భారతిని భక్తిన్ మ్రొక్కి ప్రార్థించుచున్. **14**

**అర్థం:** సిద్ధ= ఈడేరిన.

మ. అతులశ్రద్ధను నమ్రభావమున నత్యంతోద్యతిన్ మున్నె "స
న్నుతి" యన్ శీర్షికతోడ వృత్తముల నెన్నో వ్రాసితిన్ తిర్మలన్
స్థితమౌ దివ్యతపైన, ప్రత్యహము నా దృగ్సీమలో భావనో
ద్ధతితో నిల్చిన వేంకటేశ్వరుని మీదన్ బుద్ధి సారించుచున్. **15**

**అర్థం:** అతుల= సరిలేని; ఉద్ధృతి= గర్వము; అహము= దినము; సీమ= ప్రదేశము; ఉద్ధతి= గర్వము; సారించు= చూచు; ఉద్యతి= యత్నము; స్థితము= ఉన్న; నమ్ర= వంగిన.

చ. కనులకు తోచ కే మెయిని క్రమ్మిన గాడ్పు టలల్ బలెన్ సదా
మనసున పొంగు భక్తిమయ మంజుల భావపరంపరన్ కుదిం
చిన గతి శబ్దజాలము పసిండి మెఱుంగులలో, రచించి తిన్
వినయము గడ్డ కట్టినటు వృత్తములన్ నిశితప్రవృత్తిమై. **16**

**అర్థం:** నిశిత= వాడియైన; ప్రవృత్తి= నడక.

ఉ. వ్రాసిన కొన్ని పద్దెములు వంపున సొంపున నింతముందు నే
జేసిన కైత నే పిసరొ చిన్నము వంతునొ గుర్తు చేయునో;
మాసము మారినన్ వడలొ మంచులొ ముంచుకు వచ్చుచున్న, నే
వీసమొ యన్ని కాలముల వేకువ లందును లేవె సామ్యముల్ ? **17**

**అర్థం:** పిసరు= లేశము.

మ. పవనోద్రిక్త లతావిలాసము లటున్ భావమ్ము లుప్పొంగి, నే
కవన మ్మల్లుచు నుంటి నస్ఖలిత సంకల్పమ్మె నా యండగా,
భువనానేకములన్ విధి క్రమగతిన్ రక్షించు దివ్యత్వ వై
భవమున్ మ్రొక్కుచు నుందు నిత్యమగు సత్త్వాకాంక్ష పెంపొందగన్.
**18**

**అర్థం:** ఉద్రిక్త= ఉద్రేకించిన; అస్ఖలిత= తొట్రు వడని; సత్త్వాకాంక్ష= సత్త్వగుణ
మునకై కోరిక.

ఉ. మిన్నున లెక్క కంద నటు మిన్కను తారల గుంపు లెన్నియో,
అన్నియు జేరి యొక్క శశియందము, చందము, వెల్గు, కల్గునే ?
ఎన్ని విధమ్ములొ చదువు లెంత యగాధముగా పఠించినన్,
అన్నియు జేరి నిన్ తెలియు నట్టి వివేకము గూర్చునే ప్రభూ. **19**



ఉ. శక్తివి నీవు, నిన్ గొలుచు సాధనగా నొక విగ్రహమ్ముగా
భక్తిని నిన్ను నిల్పుదు రుపాయము మీఱగ, రూపురేఖలన్
యుక్తిగ నేర్పరించి తమ యూహకు తట్టిన భూషణమ్ము లా
సక్తి మెయిన్ ధనాధికు లొసంగ, ప్రయోజన మేదొ కోరుచున్. **20**

**అర్థం:** యుక్తి= ఉపాయము.

చ. తిరుమల పర్వతాగ్రమున దివ్యవిలాసము డిగ్గి వేంకటే
శ్వరు వలె విగ్రహమ్మయి విశాల ధరాస్థల జీవకోటి య
బ్బురమగు భక్తి కేంద్రమని పొంగెడు నట్లు దయావిశిష్టమౌ
స్థిరతమ దృశ్యమున్ కలుగ జేసె నటంచు తలంతు నమ్రతన్. **21**

**అర్థం:** డిగ్గి= దిగి; అబ్బురము= అపూర్వము; విశిష్ట= కూడుకొన్న.

ఉ. ఎన్నడిటన్ మహీధర సుహృన్మణిగా దిగి నిల్చెనో జనా
భ్యున్నతి మంత కల్పనము పోలిక విశ్వహితైక శక్తి, వి
ద్యు న్నిశితార్ష తేజ మెదియో నిట రాలి ఘనీభవించి భ
క్తి న్నిను గొల్చు మానవుల దీక్షకు తావల మాయె నో ప్రభూ. **22**

**అర్థం:** మహీధర= కొండ; నిశిత= వాడిచేయబడిన; తావలము= ఆధారము;
ఆర్ష= ఋషి.

చ. సకలము మించి నిశ్చితవిధాకృతి యన్నదిలేని యట్టి భా
వుక మని నిన్ దలంచియును, పోడిమిమై నొక తావునందు ని
ల్చు కలితమూర్తి వంచు మదిలో నిను నిల్ప దలంచు నట్టి కో
రిక జనవర్గ భక్తి సితరేఖయె, ముంగలమూర్తి గొల్వగన్; **23**

**అర్థం:** భావుకము= శుభము; పోడిమి= సౌఖ్యము; సిత= తెల్లని; ముంగల=
ముందు.

మ. ఇదె నీ మాయ విచక్షణాధికముగా నేదో యగాధోహ నె
మ్మదిలో సంభవ మందు, కంటిమొగి శుంభత్ శోభలో వందనా
స్పదమై తిర్మల నిల్చు నీ యతులరూపమ్మెంతగా జూచి యెం
త దృఢోత్సాహముమై నుతించినను నిత్యౌత్కృష్ట్యసంసిద్ధికై. **24**

అర్థం: శుంభత్= ప్రకాశించెడు; ఔత్కృష్ట్య= మేలు; సంసిద్ధి= చక్కని సిద్ధి.

ఉ. దేవు దనంగ సర్వహితదీక్షకు చక్కని మాఱు పేరు; ప్ర
జ్ఞావధి నెన్నొ మార్గములు కల్పన సేతుము దివ్యసేవకై;
ఏ విధి కొల్చినన్, కుసుమ వృంతము చుట్టెడి భృంగ దృష్టికిన్
తావలమౌ మరందము విధమ్మున, కోరిక సత్త్వసిద్ధియే. **25**

అర్థం: ప్రజ్ఞ= బుద్ధి; అవధి= మేర.



# యాత్రికుల గుంపు

ఉ. శ్రీపతి నిల్చియుండె మన సేమము బొమ్మగ వేంకటేశుడై,
చాపిన దివ్యహస్తము ప్రజా పరిరక్షణ సూచనమ్ముగా;
చూపుల ముచ్చటై మొగము సొంపులు పెంచిన నామ మెంచుచున్
ప్రేపు మొదల్ జనమ్ము లిట లెక్కకు మించిన రీతి నిల్తు రా
లాపము సేయుచున్ తిరుమలాధిపు నామము గొంతు లోతులన్. **26**

అర్థం: ప్రేపు= ఉషఃకాలము.

ఉ. తూరుపుకొండపై నినుడు తోచెనొ లేదొ జనమ్ము గుంపులై
చేరుదు రాలయమ్ముదరి చెంగున లోనికి పర్వు లెత్తగన్,
బారులు తీర్చి నిల్వబడు భక్తుల మోములు స్వామి దర్శనా
శారుణ విస్తృతిన్ మెఱసినట్టులు పొంగులు చెందుచుండగన్. **27**

అర్థం: విస్తృతి= విరివి.

ఉ. మ్రొక్కులు తీర్చుకొంటి మును పుణ్యఫలోద్ధతి నిండు వెల్గులో
చెక్కిలియం దపూర్వముగ చిందెడు తృప్తి మయూఖ సొంపులో
ఎక్కిన కొండకున్ కరము లెత్తి నమశ్శతముల్ ధ్వనించుచున్
మిక్కుటమైన బత్తి బలిమిన్ దిగుచుందురు యాత్రికప్రజల్. **28**

అర్థం: ఉద్ధతి= గర్వము; మయూఖ= కాంతి.

చ. వేసవికాలమం దుదయ వేళ వియత్తలమందు సూర్యరే
ఖా సముదాయ మెంత వడిగా నలుదిక్కుల వెల్గునందునో;
ఆ సమయమ్ము మించకయె యంగలు వేయుచు స్వామిదర్శన
ధ్యాసను తిర్మలాలయపథమ్మున మూగుచునుంద్రు యాత్రికుల్. **29**

**అర్థం:** పథము= త్రోవ.

**చ. తిరుమలకొండ నీ యునికి; తీరున నిన్ గొలువంగ వందలో**
**నరనిముసమ్ము సేపయిన, నన్ని స్థలమ్ముల నుండి భారతే**
**తర నివహమ్ములున్ పరువు దాటున వత్తురు, నిన్ను మ్రొక్కి నీ**
**కరుణ రవంతయైన తమ కందెడు కోరిక పొంగు నందగన్. 30**

**అర్థం:** తీరున= చక్కన; నివహమ్ము= సమూహము; దాటు= దూకుడు; పొంగు= సంతోషము.

**ఉ. కొండలనీడనాడ చిఱు ఘోషలు, కొమ్మల గూళ్ళనుండి బ్ర**
**హ్మాండము మూలలన్ చెలఁగునట్లు శకుంతమృదు స్వనమ్ములున్,**
**అందను కోరుచున్ తిరుమలాధిపుపై వినిపించు పాటలున్,**
**పండిన యాత్రతో ఫలము నందిన రీతి మనస్సు పొంగెడిన్. 31**

**అర్థం:** ఘోష= ఆవుల మంద; చెలఁగు= శబ్దించు,వికసించు; ఆడ= అక్కడ.

**ఉ. పిల్లల చంక నెత్తుకొని వేడికి కొండల రాటు పోటునన్**
**మెల్లగ నంగవేయుచు గుమిన్ విడిపోవగ రాని యాత్రయం**
**దల్లిక బిల్లికన్ తమ జనాళికి దూరము కాని రీతిగా**
**తల్లులు సాగుచుందురు పదమ్ము కుటుంబము చొప్పు తప్పకే. 32**

**అర్థం:** రాటు= ఉపద్రవము; ఆత్రము= త్వర; అల్లికబిల్లిక= ఒద్దిక; చొప్పు= మార్గము.

**మ. పవనోద్రిక్త నిశీథ మేఘమున శంపాస్మేర సల్లాపమం**
**దవనీగర్భము చిందులాడు తఱి నేన్ దర్పించి నీ దర్శనో**
**త్సవ సన్నద్ధ విలాస ముట్టిపడు ధట్టన్ దప్పకే దేవళ**
**మ్ము వడిన్ జేరగ త్రుళ్ళు మూకల మొగమ్ముల్ ముచ్చటన్ గొల్పెడిన్. 33**



**అర్థం:** ఉద్రిక్త= ఉద్రేకించిన; నిశీథ= రేయి; శంప= మెఱుపు; స్మేర= కొంచెము వికసించిన; దర్పించి= గర్వపడి; సన్నద్ధ= ప్రయత్నపడిన; ధట్ట= సమూహము; త్రుళ్ళు= ఎగురు; తఱి= సమయము.

**ఉ. ఎండకు గాని దట్టపుమొయిళ్ళకు గాని భయమ్ము నంది నీ**
**కొండకు రాక మానరు నిగూఢముగా తమ కున్న మ్రొక్కు లు**
**ద్దండ పటిష్ఠతన్ నిశిత తన్మయ బుద్ధిని తిర్మలాధిపుం**
**డుండు నివాసమందె యతులోత్సుకతన్ ముగియింప పొంగరే. 34**

**అర్థం:** నిగూఢము= మఱుగుపుచ్చినది; ఉద్దండ= ఎక్కువైన; పటిష్ఠత= మిక్కిలినేర్పు; నిశిత= వాడిచేయబడిన; అతుల= సరిలేని.

**ఉ. పద్యము లెన్ని వ్రాసినను వ్రాయుట కింకను నుండు నీపయిన్**
**వాద్యము లెన్ని మ్రోగినను పల్కునె తిర్మల సుప్రభాతమున్**
**సేద్యము లెన్ని చేసినను చిత్తము దున్నునె బత్తి విత్తు, నై**
**వేద్యము లెన్ని పెట్టినను విచ్చిన సద్హృదయమ్ము మించునే? 35**

**అర్థం:** సేద్యము= పైరుపెట్టుట.

**చ. స్థిరమతిమంతులై నిను నుతించెడి వారల కిమ్ము సొమ్ము సం**
**బరమును మించి యా కలిమిపై మనసొగ్గని నిర్మలత్వమున్**
**ధర గల జీవకోటిపయి తథ్యముగా వికసించు ప్రేమ, క**
**ప్పురమున వెల్గు భగ్గుమను పోలికగాక, నిరంతరమ్ము దృక్**
**సరణికి చిక్కకే దొరలు గాలిని బోలినయట్లు దేవరా! 36**

**అర్థం:** సరణి= వరుస.

# అస్వార్థయాత్ర

ఉ. చేయ దలంచు కార్యమున చిక్కని దీక్షయె గాని, స్వంతలా
భాయుత వాంఛ లేనటుల యాత్రలు సల్పగ జేయుమా ప్రజన్,
ఏ యభిలాష లేక తన కబ్బిన సుస్వన యోగ్యతా ధృతిన్
కోయిల దిక్కులూగు నటు కూసిన రీతిని శ్రావ్యరాగముల్. **37**

**అర్థం:** చిక్కని= బలముగల; లాభ+ఆయుత= లాభముతో కూడుకొనిన; ధృతి= సంతోషము.

ఉ. ఎంతటి పెచ్చు కోరికల నేర్చి మనమ్మున కొండనెక్కగా
గంతులు వేసి వత్తు రొకొ కల్మషమూర్తులు కొందఱుద్ధృత
భ్రాంతిని, నీవునున్ తమరి లాగు వరమ్ముల బేర మేర్చుదన్
చింతను, వీసమైన తమ చిత్తము లుత్తమ రీతి నొత్తకే. **38**

**అర్థం:** పెచ్చు= అధికమైన; ఏర్చి= చక్కబఱచి; మూర్తులు= శరీరములు; ఉద్ధృత= పైకెత్తబడిన; ఏర్చు= చక్కబఱచు; చింత= తలపు; ఒత్తకు+ఏ= ఒఱగకే.

ఉ. "ఎక్కుట కొండ నీ పయి రహించిన బత్తిని జేసి మాత్రమే,
నిక్కువమైన వాంఛ మది నేనియు వేఱుగ లేనె లేదయా,
మొక్కుబడిన్ శ్రమించి పరిపూర్తి యొనర్చుట కా ది" దంచు నీ
చెక్కిలి చేయి సాక్షిగ వచింపగ నేర్చిన వారలెందఱో ? **39**

**అర్థం:** రహించిన= వర్ధిల్లిన; చెక్కిలి= కపోలము.

చ. తిరుమలకొండ మీద మన దృక్కుల కక్కజమైన మేలి సం
బరమును గూర్చు వేంకట శుభాకృతి భవ్యవిలాస సూచన
మ్మెఱిగి యెఱుంగ లేని యఖిలేశ్వరు చిత్ర మహత్వ దీధితుల్
స్థిరమనసున్నవారు గమనింతురు కన్నులు మూసి తెప్పలన్. **40**

**అర్థం:** అక్కజము= ఆశ్చర్యము; భవ్య= యోగ్యమైన; దీధితి= కిరణము.



మ. నదిలో నుప్పెనహోరులో చెదరుచున్ కంపించు నౌకన్ బలెన్
మదిలో నిల్కడ మృగ్యమై పవనసంబద్ధమ్ముగా నుంటినే,
పొదలో రాలిన రత్నభూషణతతిన్ పోగొట్టుకొన్నట్లు; నా
రొదలో నిల్చిన నిశ్చలత్వధృతి నాలోకించుమా దేవరా! **41**

**అర్థం:** చెదరుచు= ఎగిరిపడుచు; కంపించు= వణకు; మృగ్యము+ఐ= వెదుకదగినది; సంబద్ధము= కట్టబడినట్లు; ధృతి= ధరించుట, సంతోషము.

ఉ. ఎందుల కోయి యేదొ ఘనకార్యము నీ వొనరించుచున్నటుల్
విందున కేగునట్టులుగ వేతువు గంతును తిర్మలాద్రికిన్,
స్యందన మెక్కి త్రుళ్ళిపడు చందమునన్ గమనమ్ము కొమ్ముగా?
వందన మొక్కటైన సరి వర్తన నిర్మలధామయోగ్యమై. **42**

**అర్థం:** స్యందనము= రథము; ధామ= ఇల్లు; కొమ్ము= కొన, శిఖరము.

చ. మనసున నిండు చల్లదన మబ్బని వాడు వివేకవంతు నన్
మునుకువ తోడ నెత్తయిన భూమికి కొండల మధ్య వేసవిన్
చని సుఖమందుచున్నటులు స్వాంతము నూయెలలూపు,క్రిందకున్
మునుపటి తావునన్ దిగెడు ముందర, బుద్ధిని గూర్చుమా ప్రభూ! **43**

**అర్థం:** మునుకువ= పూనిక.

ఉ. పామర యోచనాక్రమ మభాగ్యమనస్సున రేగు వారిలో,
కామసముచ్చయ మ్మెగసి కన్నులు మూతలు పడ్డవారిలో,
నేమము తప్పి శిష్టజననింద నొనర్చ గడంగు వారిలో,
నీ మననమ్ముపై మనసు నిల్చెడు యోగ్యత సుంత కొల్పుమా. **44**

**అర్థం:** పామర= మూర్ఖుడు; అభాగ్య= ఆపదనొందిన; కామ= ఇచ్ఛ; సముచ్చయము= ప్రోగు; నేమము= నియమము; కడగు= యత్నించు; చింతన= పలుమాఱు తలచుట.

ఉ. నీకయి ప్రార్థనా సభలు నిత్తెము కూర్చు ప్రసిద్ధ కోటిలో
ప్రాకిన నిర్మలత్వ ధునిపై భవదుజ్జ్వలదృష్టి రేగి యా
మూకల గుండెలోతులను మూగిన నిక్కపు స్వార్థచింతనో
ద్రేకము పోల్చగల్గునని, లేశమెఱుంగగ జేయుమా ప్రజన్. **45**

**అర్థం:** ధుని= ఏఱు.

ఉ. పంచను జేరి మిత్రుడని పైకము దాచుకొనంగ నెంచి యే
కొంచెము వడ్డి వచ్చు నని కోరు నమాయకకోటి యాసలన్
పెంచుచు మొత్తమున్ గుటకలేసెడు నీచుల జూచియోర్తువా,
కంచెయె చేను మేసినటు కర్షకు లార్చుచు నేడ్చుచుండగాన్;
మంచితనమ్ము కూర్చు మిసుమంతగ నేనియు నట్టి దుష్టులన్. **46**

**అర్థం:** ఆర్చుచు= కూయుచు.

ఉ. ఇంతకు మించు గడ్డు పను లేర్చిన నీ కిది యెంత దేవరా!
అంతటి నీచమానవజనాళియు నిత్తెము వచ్చుచుందురే
యెంతయొ బత్తియున్నయటు లీ పరిపూతమహోజ్జ్వలాద్రికిన్,
గంతులు వేయుచున్ పణము వోలె విదుల్చుచు రూక మూటలన్. **47**

**అర్థం:** మించు= అసాధ్యమైన; ఏర్చిన= ఏర్పరచిన; పరిపూత= చక్కగా పవిత్ర
మైనది; పణము= పందెము; విదుల్చు= రాల్చు.

ఉ. బంతులు సాగుచుండు జనవర్గము గుండెల నిండియున్న భా
వాంతర లీల తామెటులు పల్కిన నీ కది వ్యక్తమేగదా!
బంతిని నోరు చించుకొని బత్తియె రూపము దాల్చినట్టులన్
గొంతు పెకల్చి మ్రోగినను కోర్కెల పుట్టల గుట్టెఱుంగవే ! **48**

**అర్థం:** అంతర= నడిమి చోటు.



# ప్రభాతసేవ

చ. మనవలె సామియున్ నిదురమైకము జారిన దివ్యనేత్రముల్
దినకరు రాకతో తెఱచు తెన్నున నెంతు మిదెంత మాంద్యమో,
కొన లగుపించనట్టులు జగమ్ములు విచ్చిన సృష్టి నంత ద్రో
చు నియతశక్తి కీ గతిని సోలుట లేచుట యన్నవుండునే? **49**

**అర్థం:** తెన్ను= మార్గము; నియత= నిత్యమయిన; సోలుట= వ్రాలుట.

మ. మనదీ ప్రాత రుషస్సమాగమము, బ్రహ్మాండమ్ము నూగించు దే
వునకున్ "వేకువ వేళ లె" మ్మనుచు శబ్దోద్రిక్తమౌ శ్లోక కీ
ర్తనలన్ గానము సేతుమెంతొ మధురాలాపమ్మునన్, నిత్య ద
ర్శన సందానితమైన దివ్యతకె నిద్రారోపణన్ జేయుచున్. **50**

**అర్థం:** సమాగమము= చక్కనిరాక; ఉద్రిక్త= విజృంభించిన; సందానితము=
కూర్చబడిన; ఆరోపణ= లేనిది మోపుట.

చ. కోరిక లుండనట్లు మది కూరుచు మంచు నినున్ పదే పదే
కోరుచు నుందు నిత్తెమును, కోరిక వద్దను కోర్కెయిద్ది, నీ
తీరున తీర్చు నాడిక మదిన్ గన నక్కఱలేదు కాదె యా
కోరిక కూడ తీరినది కోరగ క్రమ్మఱ వెట్టి నాప్రభూ? **51**

**అర్థం:** తీరు= విధము.

చ. అనుదినమున్ ప్రభాతసమయమ్మున చీకటి కారు పూత మె
ల్లన సడలంగ ప్రజ్వలిత రాగ మయూఖలు నింగి పొంగి, నూ
తన కిరణద్యుతిన్ ఋతువిధానములో చెలరేగ, వేంకటే
శుని నిరతార్ద్రతా ప్రణవసూచన కన్గొని కన్ను లార్చెదన్. **52**

అర్థం: ప్రజ్వలిత= ప్రకాశించిన; రాగ= రంగు; మయూఖలు= కాంతి,జ్వాలలు; ఆర్చు= ఆడించు; ప్రణవ= ఓంకారము.

ఉ. సోయగ మూగ కాలపురుషుండు నిరంతర నవ్యభావనా
ధ్యాయముగా జగమ్మున పదమ్ములు మోపెడు వేళలన్ జన
శ్రేయము నాదమై దెసల చిమ్మిన రీతిని సుప్రభాత శో
భాయత రావముల్ గగన మంతయు క్రమ్మినయట్లు తోచెడిన్. 53

అర్థం: సోయగము= అందము; ఊగ= ఆందోళించు; నిరంతర= ఎడతెగని; భావన= తలపు; మోపెడు= ఆనించెడు; ఆయత= దీర్ఘము.

ఉ. పయ్యట రేగి సిగ్గుపడు భామిని మోమును బోలి గాలిలో
చయ్యన నూగు పూగుబురు చాయల తేనెల జాలు నెంచుచున్
తియ్యని కైపునన్ తిరుగు తేటిని మించిన యట్టు లాత్రతన్
శయ్య విడంగనే పరుగునన్ గుడికేగ దలంత్రు యాత్రికుల్. 54

అర్థం: చయ్యన= శీఘ్రముగా; జాలు= అల్పప్రవాహము; కైపు= విజృంభణము.

ఉ. చూపుల కంతు కన్పడని చొప్పున చీమల బారు లట్లు, దీ
ర్ఘాపగగా, నుషస్సులు ధరన్ మెఱపందెడు వేళలందునన్,
మాపటి గండు చీకటులు మాసియు మాయక మున్నె యాత్రమై
నీ పొలిమేరకున్ పరుగు లెత్తుచు వత్తురు దీర్ఘవాంఛమై. 55

అర్థం: ఆపగ= నది.



# కోర్కులు

మ. అదిగో చూడుము వేంకటేశ్వరుని శిల్పాకార మాసత్త్వధీ
ప్రదమా గోపురమందు; దేవళములో బంటుల్ నినున్ ద్రోయుచున్
“పదముల్ ముందుకు వేయుమా, జరుగుమా, పంక్తుల్ త్వరన్ సాగ” నం
చదలింపిచ్చుట లేదు, తీఱికగ చిత్రానేకముల్ గాంచుమా! 56

అర్థం: సత్త్వధీ= సత్త్వగుణప్రధానమైన బుద్ధి; ప్రదము= ఇచ్చునవి; జాలము= సమూహము.

ఉ. ఎంతొ యెఱింగి నట్టులు భ్రమింతురు కొందఱు గ్రంథపాండితీ
భ్రాంతిని, నిన్ను గూర్చిన పురాణ కథాంశము లెన్నొనేర్చి, యా
ద్యంతము నా పురా రచన లందు గలట్టి యగాధ సూక్తు లే
కొంతొ యెఱింగినన్ మదిని కోర్కుల పంజర మూగుచుండగన్. 57

అర్థం: భ్రాంతి= మిథ్యామతి; ఆద్యంతము= మొదటి నుండి తుదివఱకు.

ఉ. ఎంతొ వ్యయశ్రమమ్ములు ఫలించెను నేడిట తిర్మలాధిపా
త్యంత మనోహరాకృతి నహర్పతి కన్నులు విచ్చువేళ న
శ్రాంత దయాప్రసారమయ రంజనలో గమనించు భాగ్య మా
ద్యంతము లేని సంస్తుత విధమ్ము లభించె నదృష్ట రీతిగన్. 58

అర్థం: అహర్పతి= సూర్యుడు; అశ్రాంత= ఎడతెగని; రంజన= రంజించునది; ఆద్యంతము= మొదలు తుద; సంస్తుత= స్తోత్రము చేయబడిన.

ఉ. ఆకులు రాలి బోసియగు నట్టి మహోన్నతశాఖ పోలికన్
ప్రాకిన యాశలన్నియును బాసి మనస్సు విరక్తిమార్గ భా
వాకరమై మెలంగు నటు లావల క్రొత్త చిగుళ్ళు పుట్టు నీ
కాకుల మైన కోరికల కంపన లేనటు సేయుమా ప్రభూ! 59

**అర్థం:** ఆకరము= గని; మెలంగు= వర్తించు; ఆకులము= చెదరిన; కంపన= కదలుట.

**మ.** **ఇదియో యెద్దియొ పొంద గోరెదను నా కిమ్మంచు నర్థించ, నె**
**య్యది నా భౌతిక వాంఛలన్ మడచి నిత్యమ్మైన తేజస్సు పై**
**హృదయక్షేత్రము నేర్చునో యదియె యర్థించంగ నుంకింతు నే**
**నెదియున్ కోరనటన్న కోర్కె జను లూహింపంగ చిత్రమ్ముగా.** **60**

**అర్థం:** మడచి= వంచి; ఏర్చు= ఏర్పఱచు.

**ఉ.** **ఎంతగ గ్రంథజాలమున నింపగు నీ మహిమప్రసక్తి నా**
**ద్యంతము లేని విస్మయ కథాంశములన్ పఠియించుచుండినన్**
**భ్రాంతి యటన్న దోసము మనస్సున నక్కిన యట్లు దోచు, న**
**శ్రాంత సమస్యగా, నది తొలంగు నకుంఠిత నిష్ఠ గూర్చుమా!** **61**

**అర్థం:** జాలము= సమూహము; ఆద్యంతము= మొదలు తుది; విస్మయ= ఆశ్చర్యకరము; భ్రాంతి= మిథ్యామతి; అశ్రాంత= ఎడతెగని; అకుంఠిత= మొక్కపోవని.

**ఉ.** **ఎన్నియు క్లిష్టకార్యములు నీ వవలీల నొనర్చి యున్నటుల్**
**మున్నె మునుల్ వచించిన దెఱుంగు దుదాహరణమ్ము లెన్నొ; వి**
**ద్యు న్నిశితమ్ము నీప్రకృతి, దుర్లభ మన్నది నీకులేదు, నా**
**విన్నప మొక్కటే: హృదయ వీథిని శుద్ధవికాస మేర్చుమా!** **62**

**అర్థం:** వికాసము= తెలివి; విద్యున్నిశితము= మెఱపువలె వాడియైనది; శుద్ధ= దోషములేని; ఏర్చు= ఏర్పఱచు.



**ఉ.** **ఈ రకమైన కోరిక సుహృన్మతియౌ అవధాని మున్ననెన్**
**"కోరిక కాని కోర్కి" యని, కూర్చుచు పీఠిక నాదు "సన్నుతి"**
**స్మేర కవిత్వకావ్యమును మెచ్చుచు నెన్నొదినాల వెన్క; నా**
**సార హిత ప్రవీణ మన సందున జూచుచు వాని మ్రొక్కెదన్.** **63**

**అర్థం:** స్మేర= వికసించిన; అవధాని= శ్రీ దివాకర్ల వేంకటావధాని.

**చ.** **బ్రదికిన నాల్గు నాళ్ళను శుభప్రద వేంకట దివ్యచింతనా**
**స్పద పరిపూతమానస విశాలసమాఖ్యకు నోచుకొన్నటుల్**
**విదళన శక్తిమంతమగు వేసవి గాడ్పుదుమార మందునన్**
**చెదరని చిన్ని మొగ్గవలె నిల్చెడు శక్తిని నా కొసంగుమా!** **64**

**అర్థం:** ఆస్పద= చోటు, పని; పరిపూత= చక్కగా పవిత్రమైన; సమాఖ్య= యశము; విదళన= మిక్కిలి ఖండించు; దుమారము= దుమ్ము.

**ఉ.** **బొమ్మగ తిర్మలన్ నిలుచు మోక్ష పథోద్ధుర దర్శకుండ వం**
**దమ్మగు ఫాలభాగమున నామము కప్పిన ఱెప్ప లార్చకే,**
**సొమ్ముల కోస మాత్రమగు చూపులు నీ వయి పేర్చి జ్ఞాన లో**
**పమ్మున రేగు నాసల విపత్తున నీదెడివారి నోర్తువే ?** **65**

**అర్థం:** ఉద్ధుర= నిలుకడైన; ఏర్చి= ఏర్పఱచి.

**ఉ.** **అద్దము లెన్ని చూచినను నందలి బొమ్మొకటే గదా సదా,**
**చద్దియె తిండి దక్కినను చాలదొ, బొజ్జను నింపనే గదా,**
**ఎద్దెపు డెట్టు లేడ ఫలియించిన నిచ్చిన దీశుడే గదా,**
**హద్దుల నెన్ని ముట్టినను అంతము నీ దరి జేరుటే గదా!** **66**

**అర్థం:** అంతము= తుది; ముట్టినను= తాకినను.

ఉ. పద్దెము లెన్ని వ్రాసినను భావము నిన్ నుతియించుటే గదా,
సుద్దుల నెన్ని పల్కినను సూత్రము లోతుగ నీవె కాదొకో,
విద్దెల నెన్ని నేర్చినను వేసరి నిన్ తెలియంగనే గదా!
ప్రొద్దుల నెన్ని దాటినను పొందగ తగ్గది నీ స్మితమ్మొగా! **67**

**అర్థం:** వేసరి= శ్రమపడి; స్మితమ్మొ= నగవే, హాసమే; ప్రొద్దులు= దినములు.

మ. నిను నీ తిర్మల వాసమందు గని యెన్నేండ్లాయెనో, నిన్ను బో
లిన యాకారము లెన్ని దేశములనో రేకెత్తినన్, కొండలం
దున స్వచ్ఛానిల వీవనన్ పొరలు సద్యోదివ్యతా స్ఫూర్తినం
దినటుల్ యాత్రికు లెంతగా మురిసి తృప్తిన్ పొందినట్లుందురో! **68**

**అర్థం:** అనిల= గాలి; పొరలు= లభించు; సద్య= అప్పుడు.

చ. అతిమధురమ్ము తిర్మలకు యాత్రమెయిన్ జనుటన్న యూహయే,
స్తుతిమెయి వేంకటేశ్వరుని శుద్ధవిలోకన మెంత యోగ్యమో,
స్థితమతి గూర్చి కొండగడి దిగ్గిన బొమ్మపయిన్, సుమమ్ములో
నతికిన తేనె బొట్టు పయినట్లు, మనస్సును నిల్పగా వలెన్. **69**

**అర్థం:** శుద్ధ= పరిశుద్ధమైన; గడి= సీమ.



# హుండీ

చ. ఇతరులు చూడనట్లు, జగదీశ్వరు డొక్క డెఱుంగు నట్లు నీ
వితరణ విస్తృతిన్, గుడిని విచ్చిన హుండికె యబ్బురమ్ముగా
నతులిత తృప్తి రేఖల విహారము కన్నుల నిండగా, జగ
త్పతి నిను మెచ్చు నన్న భ్రమ పర్విన మోమున నుత్సహించెదే ? **70**

**అర్థం:** అతులిత= సరిలేనిది.

ఉ. లోకు లెఱుంగ నట్టులుగ రూకలు కొందఱు రాల్చ హుండిలో
ప్రాకటరీతి నల్వురి తలంపుల కెక్కెడు నట్లు కొందఱు
త్సేకము మింటి నంటునటు, దేవుని మాట యటుంచి, మానవా
లోకన మబ్బు నన్న తమిలో ధనరాసులు గుప్పుచుందురే! **71**

**అర్థం:** ప్రకట= ప్రసిద్ధమైన; ఉత్సేకము= అతిశయము; ఆలోచన= చూపు;
తమి= కుతూహలము.

ఉ. నీ శుభదర్శనమ్మయిన నిక్కున కోవెల చుట్టు నుత్కటా
వేశము పొంగులో నడుగు వేయుచు గోపుర శిల్పజాల శో
భా శిఖలందు నేత్రములు భ్రాజితవిస్తృతి నంద పుణ్య యా
త్రా శమనమ్ము దక్కిన విధాన గడింతురు తృప్తి యాత్రికుల్. **72**

**అర్థం:** నిక్కు= గర్వము; ఉత్కట= అధికమైన; శిఖలు= కిరణములు; భ్రాజిత=
ప్రకాశము నొందిన; శమనమ్ము= శాంతి, వరము.

# లడ్డూలు

చ. క్రమముగ చిన్న వౌ నటులు కన్పడుచుండిన లడ్డులన్ ప్రసా
దములను బైట నాలయ వదాన్యులు కూర్చిన కొట్ల నుండి పై
కము గడి లేనటుల్ కొని ప్రకామముగా తమ బంధుమిత్ర వ
ర్గముల కొసంగ గల్గినటులన్, దిగుచుందురు కొండ యాత్రికుల్. **73**

**అర్థం:** వదాన్యులు= మనోజ్ఞముగా మాటలాడువారు; గడి= ఎల్ల; ప్రకామము= ఇచ్చవచ్చినట్లు.

చ. తిరుపతి యాత్ర జేసి యరుదెంచిన మిత్రుల నుండి యెంతొ య
బ్బురముగ లడ్డు ముక్కలను పొందగ నెందఱొ కోరుచుందు రిం
దరుదగు దైవ చింతన విధమ్మెదొ గుప్తముగా బఱంగు, నీ
శ్వరు కరుణాఫలమ్మిదను భావము దాగి తలంపు వంపులన్. **74**



# కాలినడక

చ. నడకను కొండ కేగెడు జనమ్మున కెంతొ ముదమ్మునిచ్చు న
ల్కడలను చెట్టు కొమ్మలను గంతులు వేసెడి తొంటి బందుగుల్,
పడమటి యంచులందు రవిపాదము లంటెడు లోన తిర్మలన్,
పొడవడు నట్లు దేవళము పోడిమి కన్నుల నంటుచుండగన్. **75**

**అర్థం:** కడలు= దిక్కులు; తొంటిబందుగుల్= కోతులు; పాదములు= కిరణములు; పొడవడు= కనబడు; పోడిమి= ఒప్పు, విధము.

ఉ. చెట్టులు పుట్టలున్ గనుచు చేతుల నూపుచు త్రుళ్ళి సొంతమౌ
కట్టడి మీద కొండ కయి కాల్నడకన్ చను భక్త కోటిలో
తట్టస యెంతగా గలదొ! తప్పని రీతిని నేండ్ల క్రిందనే
నట్టులె పోయి యుంటి గద నా తొలి తిర్మల కొండయాత్రలో. **76**

**అర్థం:** త్రుళ్ళి= ఎగిరి; కట్టడి= పూనిక; తట్టస= ధైర్యము.

శా. కుందన్ నేరని యోగ్యతన్ దొరలుచున్ "గోవింద గోవింద గో
విందా" యంచు మహోత్సవోత్థితధృతిన్ వేమారు లర్థించుచున్
మందన్ ముందుకు వంగి గంతు లిడుచున్ మానుష్యకమ్మేగు నా
చంద మ్మెంతగ ముచ్చటన్ గొలుపునో సద్బుద్ధి మంత ప్రజన్! **77**

**అర్థం:** ఉత్థిత= పెరిగిన; ధృతి= సంతోషము; మానుష్యకము= మనుష్యుల సమూహము; కుందు= క్రుంగు.

మ. కలలో నైనను వాహన మ్మొసగు సౌఖ్య మ్మందగా గల్గి తి
ర్మలకుం బోవలె నన్న భావము జనస్వాంతమ్ములం దా దిన
మ్ములలో లేదు, నగమ్ముపై నిలుచు నా మూర్తిన్ గనంగల్గు ని
ర్మల భావచ్ఛవి చాల దెక్కగల దార్ఢ్య మ్మెంతగా ముఖ్యమో! 78

అర్థం: నగము= కొండ; ఛవి= కాంతి.



# ఒక విచిత్ర సంఘటన

చ. ఇది కథ కాదు, తిర్మలమహీధరమందున మున్నొకప్డు నా
కొదవిన చిత్రసంఘటన; యొర్మిని పేర్మిని దేవళమ్ము ముం
దుదయము నుండి యిట్టటుల నూగుచు దర్శన భాగ్యలభ్యతా
ముదము లభించ కాత్రమున పొంగు దిగుల్ దడతోన క్రుంగితిన్. 79

అర్థం: మహీధరము= కొండ; పేర్మి= అతిశయము; ఆత్రము= త్వర; ఓర్మి= ఓర్పు; దడ= వణకు.

చ. దినము దినమ్ము రెచ్చెడు నదిన్ బలె యాత్రికసంఖ్య గంతు వే
యు,నయిన నింతకున్ మును పెదో నిముసమ్మున వేంకటేశు ద
ర్శనము లభించుచుండెడిది; శక్తి కొలందిని నాడు కూడ దే
వుని కొలువంగ నెంచితిని పొంగుచు ముందున కంగ వేయుచున్. 80

చ. ఫలితము సున్న; కాలిదడ పట్టగలేక ప్రవేశసూచిక
స్థలమున కిప్పు డప్పుడు పదమ్ముల నీడ్చుచు పోవుచుంటి, నెం
దుల కిది వ్యర్థయత్న మని తోచి యొకానొక గుంపు సందడిన్
నిలబడితిన్ నిరాశమెయి నింటికి పోవు తలంపు పెంపునన్. 81

మ. ఇదె నా భాగ్యమొ యీ దినమ్మనుచు, నాహృన్మందిరమ్మందు ధీ
ప్రదమౌ తిర్మలవేంకటేశ్వరుని చిత్రం బూని సందిగ్ధతా
స్పదమౌ చింతన నూగుచున్ మనసు క్షోభన్ త్రుళ్ళు నా వృత్తిలో
నెదియున్ దోచక యింటి కేగవలె నింకే మార్గమం చెంచితిన్. 82

అర్థం: ధీ= బుద్ధి; సందిగ్ధత= సందేహము; ఆస్పదము= చోటు; చింతన= పలుమాఱు తలచుట; త్రుళ్ళు= ఎగిరిపడు; ఆవృత్తి= తిరుగుడు.

ఉ. ఊగుచు నున్న నామనసు నోర్చుచు చూపులు నాల్గు దిక్కులన్
రేగిన రీతి త్రిప్పెడు తఱిన్ పసి గట్టితి నేదొ గుంపు వే
వేగము వచ్చుచుండుటయు, వేత్రము లూను భటుల్ జనమ్ములన్
మూగని య ట్లదల్చుటయు, పోల్చక యే మది యంచు నిల్చితిన్. 83

అర్థం: రేగు= విజృంభించు; వేత్రము= బెత్తము.

శా. ఏమీ తోచని చూపులన్ బెదరుతో నీ ప్రక్క కాప్రక్కకున్
మోమున్ త్రిప్పుచు, కన్నులార్చుచు సదా మూర్తిన్ మదిన్ నింపు నా
కేమో విన్పడసాగె స్పష్టముగ; నాడే దర్శనార్థమ్ము దే
శామాత్య ప్రథముండు వచ్చెనని, యా యాప్రక్కలన్ ఘోషలన్. 84

శా. లాటీ త్రోపుడు నంటి యంటనటు నిల్వంబడ్డ నా బిక్కమో
మాటోపమ్మున కంది యుంట గనెనో ఆ గుంపులో నుండి నా
యాటంకమ్ము నెఱింగి నట్టులుగ నా కాశ్చర్యముప్పొంగ, కన్
గీటెన్, "రండి గురూ" యటంచొకడు, నా క్లేశమ్ము జారన్ త్రుటిన్. 85

అర్థం: ఆటోపము= సంభ్రమము; క్లేశము= దుఃఖము.

చ. "తొలగుడు","అడ్డు రావలదు","త్రోవను వీడవలెన్ ప్రధానికై",
"నిలిపిరి ధర్మదర్శనము నెంతయొ సే" "పటు పర్వరా" దటం
చెలుగు వియత్తలమ్ము వఱ కేగెడు నట్టులు మ్రోత రేగె, తి
ర్మల గిరియే ప్రతిధ్వనితమై నటు, చూచుచు చూచుచుండగన్. 86

శా. నా విద్యార్థి యొకండు సత్పురుషుడున్నా డా సమూహమ్మునన్
ఠీవిన్ కాల్ కదలించుచుండిన ప్రధానిన్ చుట్టు వర్గమ్ములో,
నా వంకన్ కను లెత్తి చూచి, నిబిడానందమ్ముతో నాత డం
తే "వేగమ్ముగ రండు రం" డనియె నన్ జేర్చన్ బృహత్శ్రేణిలో! 87

అర్థం: నిబిడ= దట్టము; బృహత్శ్రేణి= గొప్ప వరుస.

ఉ. "రండు గురూ" యటంచు తన లాలనపూర్వకహస్తచాలనో
ద్దండధృతిన్ ననున్ తమ ప్రధాని సమూహములోన జేర్చె నా
తండు; రవంతగా కను కదల్చి కదల్చని హాసభాసియై
యుండె ప్రధాని నన్నుగనియున్ గన నట్టులు ముందు సాగుచున్. 88

అర్థం: చాలన= చలింపజేయుట; ధృతి= సంతోషము; ప్రధాని= భారతదేశ ప్రధానామాత్యుడు–శ్రీ పి.వి. నరసింహారావు.

శా. అంతే, యా యధికార జాతిని నొకండైనట్లుగా పొంగుచున్
సంతోషమ్మున ముందు సాగితిని, విశ్వాధ్యక్షుడౌ స్వామి నా
స్వాంతమ్మందున నిల్పి, మున్నెపుడు నాభాగ్యమ్ము కానంత వి
శ్రాంతిన్ విగ్రహ మందె చూపొదిగి యారాధించితిన్ తృప్తిమై. 89

అర్థం: ఒదిగి= సమృద్ధమై.

శా. స్వామీ, నిన్ గన లేదటన్న వగతో సంతప్తమైయున్న య
క్షేమచ్ఛిన్న మనస్సు నిశ్చలముగా నీ క్రేవన్ జనన్ జేసితే !
నీ మోమాలయ విగ్రహద్యుతిని నా నేత్రోత్సవ స్ఫూర్తిగా
నామూలాగ్రముగా కనంగలుగు పుణ్యం బబ్బె నిప్పట్టునన్. 90

అర్థం: సంతప్తము= కాచబడియున్న; అక్షేమ= అశుభము; ఛిన్న= ఛేదింపబడిన; క్రేవ= త్రోవ; స్ఫూర్తి= తోచుట; ఆమూలాగ్రము= మూలము నుండి చివర.

చ. వెలవెల బోతి తిర్మలకు వెళ్ళిన పున్నెము దక్కలేదెయన్
వెలితి మొగమ్మునన్ దొఱలి, వ్రేటున క్రుంగు కురంగ మట్టులన్;
తలవని రీతి దివ్యతమదర్శన మబ్బిన యంతనే మనో
ఫలకము పొంగె నిర్మల ప్రభాతము నందలి పద్మమట్టులన్. 91

అర్థం: కురంగము= జింక.

చ. గురువుల కెన్నొ రూపముల కూర్చిరి దక్షిణలం చెఱుంగుదున్
మఱవని శిష్యకోటి, గురుమానసమందున దాగు వేంకటే
శ్వరు విపులస్వరూపశిల, వాని ప్రధాన పవిత్రవేదికన్,
దరిసెన మందు భాగ్యమును దక్కగ జేయుట యెంతశ్రేష్ఠమో ! 92

అర్థం: దక్షిణ= ఋత్విజుల కిచ్చెడు ధనము; గురుమానసము= గురువుయొక్క మనస్సు.

ఉ. దక్కదె దర్శన మ్మని వ్యథన్ బడి యుండిన నాకు దక్కె మున్
చిక్కని యంత దీర్ఘమగు చిన్మయ దర్శన మెట్టకేలకున్,
పొక్కిన నా మనఃఫలక మూయెల లూగె నపూర్వతృప్తిమై
చెక్కిన కమ్రశిల్పము పసిండి మెఱుంగులు చిమ్మినట్టులన్. 93

అర్థం: పొక్కిన= దుఃఖించిన; ఫలకము= పలక; కమ్ర= ఇంపైన.



# అమెరికాలో...

చ. క్రమముగ హిందువుల్ అమెరికాదెస లన్నిట నాలయమ్ములన్
విమల మనోరథోద్గతి వివేకముతో నెలకొల్ప జూడమే,
అమిత ధనాబ్ధిలో మునిగినట్టి వదాన్యజనాళి యింతొ యం
తొ మదికి తోచినట్లొసగు ధోరణిఁ దన్విని పొందుచుండరే. 94

అర్థం: విమల= నిర్మలమైన; ఉద్గతి= పుట్టుక; వదాన్య= మిక్కిలి ఇచ్చువారు; తన్వి= తృప్తి.

ఉ. కట్టిరి పిట్సుబర్గుదరి, కాననలన్ దలపించు కొండలన్,
చెట్టు రొదల్ విహాయసము చీల్చెడు తావున రాతికోవెలన్
మెట్టు కనంగ రానటుల మీదకు పోవలెనన్న సీమలో,
పెట్టిరి నీదు విగ్రహము పేర్మిని తిర్మలలోని రీతిగా. 95

అర్థం: పేర్మి= గౌరవము; పిట్సుబర్గు= అమెరికాలో ఒక పట్టణము.

ఉ కోవెల యన్నటుల్ బయటకున్ కనిపించని మందిరమ్ము లో,
నీవెటు తిర్మలన్ గలవొ నిక్కముగా నటె, విగ్రహమ్ములో
శ్రీ విలసన్మహత్త్వమును చెక్కి రిటన్ బరిమింగుహామ్‌లో
భావపవిత్రజృంభణము పర్వగ భక్తజనమ్ము దృక్కులన్. 96

అర్థం: జృంభణము= అతిశయము; బరిమింగుహాము= అమెరికాలో ఒక పట్టణము.

శా న్యూ జెర్సీ యను ప్రాచ్య రాష్ట్రతలమందున్ బ్రిడ్జి వాటర్ కడన్
తేజస్స్ఫూర్తి విలాస దంత ఫణితిన్ దేవాలయ మ్ముండగన్
రాజీ వోత్సుకతా ప్రదర్శనగ పూలన్ తేటులం బోలుచున్
పూజల్ సేయగ గంతు వేయుదు రమందోద్రిక్త భక్తిన్ జనుల్. 97

అర్థం: ప్రాచ్య= తూర్పు; రాజీవ= రాజు ననుసరించి జీవించునది; ఉద్రిక్త= ఉద్రేకించిన; తేటులు= తుమ్మెదలు; బ్రిడ్జి వాటర్= అమెరికాలో ఒక ప్రదేశము.

శా. నా పుత్రుండు శశాంక యున్న పురమం దా సెంటులూయీసులో
నీ పావిత్ర్యరుచుల్ సమస్త దిశలన్ విచ్చున్ రసజ్ఞ ప్రక
ర్షా పర్యాప్తము లూరు పోలికను నేత్రానందమౌ నట్లు, నా
వైపున్ భవ్యరుచుల్ ప్రసారమగు దేవస్థానమున్ మ్రొక్కెదన్. **98**

అర్థం: రసజ్ఞ= పండితుల; ప్రకర్ష= అతిశయము; పర్యాప్తము= తృప్తి; భవ్య= శుభమైన; సెంటులూయీసు= అమెరికాలో ఒక పట్టణము.

చ. కనులను దివ్యతాద్యుతులు క్రమ్మినటుల్ పవళించు రంగనా
థుని గుడిలోన నిశ్చలత త్రుళ్ళినటుల్ నిలుచుండు వేంకటే
శుని పరిపూర్ణ విగ్రహము సొంపును తెప్పలలోన నింపుచున్
జనులు "పొమాన" లో తనివి జాలున నీదుచు పోదు రెందఱో! **99**

అర్థం: ద్యుతులు= వెలుగులు; జాలు= అల్ప ప్రవాహము; "పొమాన"= న్యూయార్కు చేరువనున్న ఒక ప్రదేశము.

ఉ. అన్ని శుభ ప్రయత్నముల కాదిని గొల్చెదు విఘ్నదేవు న
భ్యున్నతి గొల్పగల్గు ప్రభువున్ నెలకొల్పిన క్వీన్సు కోవెలన్
విన్నపమంద నాదరణ విచ్చెదు తిర్మల వేంకటేశ్వరున్
సన్నుతి మంత దైవత దృశన్ నెలకొల్పిరి గాదె బత్తిమై. **100**

అర్థం: దృశ= చూపు; క్వీన్సు= న్యూయార్కు నగరములో ఒక ప్రాంతము.



చ. ఇటులె ప్రపంచ మంతటను జృంభిత భారతపుత్రపుత్రికా
పటలము లున్న తావుల స్వభావము నెత్తురు నింపు నుత్సుకుల్
స్ఫుటమగు దైవ చింతన విభూతిని మానస మందు నిల్పి సం
కటముల బాపు నూర్ధ్వదయకై నెలకొల్పుదు రాలయమ్ములన్. **101**

అర్థం: జృంభిత= వికసించిన; పటలము= సమూహము; స్వభావము= స్వధర్మము; ఉత్సుకుల్= ఇష్టమైన కార్యము నందు ఉద్యోగించినవారు; చింతన= పలుమాఱు తలచుట; విభూతి= ఐశ్వర్యము; ఊర్ధ్వదయ= పైనుండి లభ్యమగు కరుణ.

చ. తిరుమల సామి బోలినటె తీరున, రూపున, దృగ్ విశిష్టతన్
గరువము త్రుళ్ళు నట్లు స్మరణోత్సుకతన్ రగిలించు తీరునన్
విరివిగ నెన్నొ దేశముల విగ్రహముల్ నెలకొల్పుచున్న, నె
ల్లరి మనసుల్ త్వరన్ తిరుమలన్ జని నిన్ గన నుత్సహించునే! **102**

అర్థం: దృగ్= కన్ను, చూపు.

మ. ఇదె నీ మాయ, భవత్స్వరూపము శిలాశృంగారసంబద్ధమై
యొదిగెన్ తిర్మలలోనె ముందుగ నటం చూహించుటే కాక, నె
మ్మదిలో నెంచుదు రెందఱో జనులు దంభాక్రాంతిలో నీకు నెం
త ధన మ్మిత్తురొ యంతకంత ఫలమున్ దక్కింతు వీ వన్నటుల్. **103**

అర్థం: భవత్= నీ యొక్క; సంబద్ధము= కట్టబడిన; దంభ= కపటము; ఆక్రాంతి= ఆక్రమణము.

# నిఘంటువు

చ. కలవు నిఘంటు వందు, తెగకాచిన పూవులవోలె, నెన్నియో
పలుకులు, వాటి మర్మముల భాతి నెఱింగి రచించు సత్కవుల్
తలరుచు భావపంజరవిధమ్మున కూర్తురు హృద్యపద్యముల్,
తొలికిన యట్టు లర్థములలోన విభిన్నరుచుల్ స్రవించగన్. **104**

**అర్థం:** భాతి= విధము; తలరుచు= చలించుచు; హృద్య= మనసున కింపైన; తొలికిన= వర్షించిన; రుచుల్= కాంతి; స్రవించు= కాఱు.

చ. పలుకుల గుట్ట బోలిన నిబంధనమైన నిఘంటువందు కు
ప్పల వలె క్రమ్మియున్న పదభంగ సమీకృత కల్పనల్ మహో
జ్జ్వల మగు వర్ణనాద్భుత విశిష్టతలో సరిదిద్దు పాండితీ
విలసన మబ్బగా వలయు విజ్ఞులు మెచ్చు కవిత్వ మల్లగన్. **105**

**అర్థం:** నిబంధన= కూర్చబడినది; భంగ= అలలు; సమీకృత= ఒకటిగా చేయబడిన; విజ్ఞులు= నిపుణులు.

మ. స్థిరసాహిత్యము మాటటుంచి, పదముల్ శ్రీ వేంకటేశస్తవో
ద్ధుర పావిత్ర్యము లోన నూగు నటులన్ తోచన్‌వలెన్ శబ్ద మా
ధురిలో, పండిన మావి మించి, పువులో తూగాడు తేనెన్ బలెన్,
స్వరసౌందర్యము చిమ్ముచుండ వలయున్ పద్యమ్ము భావోన్నతిన్. **106**

**అర్థం:** స్థిర= నిలుకడైన; ఉద్ధుర= దట్టమైన; మాధురి= మాధుర్యము; తూగాడు= ఊగు.



చ. పదమునకున్ నిఘంటువుల బాటను వెల్వడు నట్టి యర్థ సం
పదకు మతింతగా వివరణ మ్మగు దానిని వాడు తీరులో
ప్రిదిలెడు భావశంపకు లభించిన తళ్కును బట్టి; కైత య
న్నది వివిధాక్షరమ్ముల నొనర్చిన ఛందము మాత్ర మౌనొకో? **107**

**అర్థం:** వివరణము= వ్యాఖ్యానము; ప్రిదిలెడు= విరిసెడు; శంప= మెఱుపు.

# ముగింపు

ఉ. వందకు పైన పద్దెములు వ్రాసితి తిర్మల వేంకటేశుపై,
ముందు రచించియుండిన సముద్యత వృత్తనిధాన మట్టులన్
వందన దీక్షమై "ప్రణతి" నర్పణ సేయుదు భక్తియుక్తి, నా
నందము స్యందన మ్మయిన యట్టులు రీవిని కైత కూర్పులో. 108

**అర్థం:** సముద్యత= పైకెత్తబడిన; నిధానము= పాతఱ; యుక్తి= ఉపాయము;
స్యందనము= రథము.

మ. ఇది నా జన్మదినమ్ము, దాని కగు ప్రత్యేకోద్ధతిన్ నేర్తువే
యెదియో జన్మదిన మ్మెఱుంగని జగత్ హేవాకమౌ నీవు? నా
మదిలో నిన్ నెలకొల్పి ప్రార్థన పదమ్మాలాపనన్ జేతు, నె
య్యది నేడేర్తునొ యేటి మొత్త మదె నా యభ్యాస మౌనట్లుగన్. 109

**అర్థం:** ఉద్ధతి= గర్వము; హేవాకము= ప్రౌఢిమ; ఏర్తును+ఒ= చక్కబఱచుదునొ.